క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్‌లో ఒకటి, ఉర్దూ మాధ్యమం, బాటనీ, కెమిస్ట్రీలలో ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55% మార్కులు కలిగి ఉండాలన్నారు. ఈనెల 4లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: దళితబంధు పథకం లబ్ధిదారులను ఎంపిక చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే ఈపథకం నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్ మాదిగ, కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు కత్తి గంగాధర్, శివకుమార్, గజ్జెల విలాస్, కల్లేపెల్లి మల్లయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

‘దళితబంధు’ నగదు తగ్గించాలి

ఆదిలాబాద్: దళితబంధు పథకంలో ద్వారా అందజేస్తున్న రూ.10 లక్షల నగదును రూ.2 లక్షలకే పరిమితం చేయాలని బహుజన జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు బుద్ధరతన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు అందరికీ సమానంగా రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేయాలన్నారు.

సభ్యత్వ నమోదు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలో శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మడావి గణేష్, మెస్రం ప్రవీణ్, గేడం మాణిక్ పాల్గొన్నారు.

బ్యాంక్‌ను తనిఖీ చేసిన ఎల్‌డీఎం

జైనథ్: మండలంలోని గిమ్మ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ని లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ ప్రతాప్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. రాంపూర్(టి) గ్రామస్తులు ఇటీవల బ్యాంకు అధికారుల తీరుపై కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో, తనిఖీ చేసినట్లు వివరించారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని పేర్కొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

గుడిహత్నూర్: మంగ్ (మరాఠీ) కులస్తులకు షెడ్యూల్డ్ కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయాల్లో జారీ చేయాలని మండల కేంద్రానికి చెందిన మాంగ్ సమాజ్ రాష్ట్ర కోశాధికారి కుశాల్‌రావ్ గాయకాంబ్లే, ఆదిలాబాద్ జిల్లా సంఘం అధ్యక్షుడు గాడేకర్ పరుశురాం డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మాంగ్ కులస్తులు నిరాక్షరాస్యత, పేదరికం కారణంగా వారి కుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందరిలాగే తమ కులానికి తహసీల్దార్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు.

‘ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి’

ఎదులాపురం: ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాల ఆశ చూపి, గద్దెనెక్కిన తర్వాత ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అరుణ్‌కుమార్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



చెట్టెక్కిన నాగుపాము

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో శనివారం నాగుపామును ముంగిసలు తరమడంతో పాము చెట్టెక్కి ప్రాణాలను కాపాడుకుంది. అనంతరం పడగ విప్పి బుసలు కొట్టింది. ఈ దృశ్యాన్ని స్థానికులు ఫోన్‌లో బంధించి, సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయింది.

ఆరోగ్య సేవలకు ఆటంకం



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న ఏఎన్‌ఎంలు

- 19 రోజులుగా ఏఎన్‌ఎంల ఆందోళన
- నిలిచిన టీకాల పంపిణీ

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్‌తో కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్‌ఎంలు సమ్మెబాట పట్టారు. గత 19 రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నారు. సమ్మెలో భాగంగా తమ విధులను బహిష్కరించారు. ఫలితంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు రెగ్యులర్‌గా అందాల్సిన వైద్య సేవలు అందడం లేదు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అవసరమైన టీకాల పంపిణీ నిలిచిపోగా.. ఇతర వైద్యసేవలకు అటంకం కలుగుతోంది.

నిలిచిన వైద్య సేవలు

పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య కార్యకర్తలు రెగ్యులర్‌గా టీకాలను అందించాల్సి ఉంటుంది. అయితే వారు విధులకు గైర్హాజరు కావడంతో టీకాల పంపిణీ జరగడం లేదు. గర్భం దాల్చిన మహిళల వివరాలను 12 వారాల్లోపు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. వైద్య శాఖ నిర్దేశించిన వెబ్‌సైట్‌లో వారి వివరాలు నమోదు చేయాలి. ఇలా చేస్తేనే కేసీఆర్ కిట్‌కు అర్హులవుతారు. కానీ ఆరోగ్య కార్యకర్తల సమ్మెతో వివరాల నమోదు సైతం నిలిచిపోయింది. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాల్సిన బాధ్యత ఆరోగ్య కార్యకర్తలపై ఉంటుంది. కానీ సమ్మె కారణంగా వీరికి అందాల్సిన సేవలు నిలిచిపోయాయి. దీంతో వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రిమ్స్ ఆసుపత్రితో పాటు ఇతర ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

రెగ్యులర్ చేయాలి



ఒప్పంద ప్రతిపాదికన పని చేస్తున్నప్పటికీ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా రోగులకు వైద్య సేవలందిస్తున్నాం. కరోణలాంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించాం. అలాంటి తమను ప్రభుత్వం నిర్లక్షం చేయడం సరికాదు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ చేయాలి.

– తులసి, కుర్షీద్‌నగర్, యూహెచ్‌సీ

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నా.. తమను కాదని ప్రభుత్వం కొత్తగా పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను జారీ చేయడం సరికాదు. నోటిఫికేషన్ ప్రకారంగా పోస్టులు భర్తీ చేస్తే తమకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

పుష్ప, హమాలీవాడ, యూహెచ్‌సీ

‘ఆదరించండి.. అభివృద్ధి చేస్తా’



మాట్లాడుతున్న అనిల్‌జాదవ్

తలమడుగు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించండి.. అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం తలమడుగు, కొత్తూరు, బరంపూర్ గ్రామాల్లో పర్యటించారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని, బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, సునీత రెడ్డి, కేదేరేశ్వర్ రెడ్డి, చంటి, తిరుమల గౌడ్, శ్రీకాంత్, ధనుంజయ్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, రమాకాంత్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

మండలంలోని కోసాయి గ్రామంలోని పురాతనమైన శ్రీపంచముఖి హనుమాన్ ఆలయంలో బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. రజినికాంత్‌రెడ్డి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు చేపడుతున్న తహసీల్దార్

ఇచ్చోడ: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. శనివారం మండలంలోని ముఖరా(బి), కోకస్‌మన్నూర్, ఇచ్చోడలో ప్రత్యేక క్యాంపెనింగ్ నిర్వహించారు. మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత బూత్‌లెవల్ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ఆర్‌ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

తాంసి: ఓటర్ జాబితాలో బూత్‌ల వారీగా వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని భీంపూర్ తహసీల్దార్ నారాయణ అన్నారు. శనివారం మండలంలోని పిప్పల్‌కోటి పోలింగ్ బూత్ వద్ద ఓటరు నమోదును పరిశీలించారు. బీఎల్‌వోలు ఓటర్ జాబితాలో స్థానికుల అభ్యర్థన మేరకు మార్పులు, చేర్పులు చేయాలన్నారు. సర్పంచ్ గంగయ్య, బీఎల్‌వోలు గంగమ్మ, సుజాత పాల్గొన్నారు.

బల్దియా వాహనాలకు డీజిల్ తిప్పలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ వాహనాలకు డీజిల్ కష్టాలు మొదలయ్యాయి. శనివారం ఉదయం ఎప్పటిలాగే బల్దియా పారిశుధ్య వాహనాలు తిర్పెల్లిలోని ఓ పెట్రోల్ బంక్‌కు వెళ్లాయి. అయితే బిల్లులు భారీగా బకాయి పడడంతో వాటికి డీజిల్ పోసేందుకు బంక్ యజమాని నిరాకరించాడు. దీంతో సిబ్బంది ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కమిషనర్ శైలజ పెట్రోల్ బంక్ యజమానితో ఫోన్‌లో మాట్లాడి రూ.10లక్షల చెక్‌ను ట్రెజరీకి పంపించామని సోమవారం లోపు డ్రా చేసుకోవచ్చని సూచించారు. వాహనాలను ఆపవద్దని కోరారు. బంక్ యజమానికి అందుకు అంగీకరించడంతో వాహనాలు కదిలాయి. ఈవిషయంపై కమిషనర్ శైలజను సంప్రదించగా రూ.24లక్షలు బకాయిలుండగా.. రూ.6 లక్షలు ప్రభుత్వ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పది లక్షలకు చెక్‌ను అందజేశామని, మిగతా బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని తెలిపారు.

సహపంక్తి భోజనాలు

బోథ్: మండలంలోని పార్డి(కె) గ్రామంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా సహపంక్తి భోజనాలు (నగర భోజనాలు) నిర్వహిస్తారు. కాగా స్థానిక ఆలయం వద్ద శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హనుమంతునికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామపటేల్ సిడం అమృత్ రావు, దేవరి జైతు, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, మోతిరాం, మదన్ బాదిరావ్, పురుషోత్తం, జంగుబాపు పాల్గొన్నారు.

గ్రామాల్లో మట్టి సేకరణ

బోథ్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్లరాజు యాదవ్ ఆధ్వర్యంలో పొచ్చర, కుచులాపూర్ గ్రామాల్లో మట్టిని సేకరించారు. నాదేశం.. నా మట్టి కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు చాబంతుల కృష్ణ, ఆకుల రాజేందర్, బత్తుల రాము, బ్రహ్మం, కార్తీక్ సాయి, ముత్తన్న మురళి, వెంకటరమణ, ప్రభాకర్, లక్ష్మణ్, గోవర్ధన్, మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

నేరడిగొండ: మండలంలో మధుర లబానా కులస్తులు తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం మండల కేంద్రంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామ నాయక్ గోతి జ్యోతి రాజ్ మాట్లాడుతూ.. మధుర లబానా మహిళలు అడవులకు వెళ్లి మట్టిని సేకరించడం జరుగుతుందని, వాటితో ప్రతిమలను తయారు చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. తీజ్ ఉత్సవాల అనంతరం ప్రతిమలను సాంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేస్తారని పేర్కొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తాంసి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని తాంసి వైద్యాధికారి శ్రావ్య అన్నారు. శనివారం మండలంలోని పొన్నారిలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ రఘు, ఏఎన్‌ఎం లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు గంగమ్మ, దేవమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

‘జోగు రామన్నను ఓడించడమే లక్ష్యం’



కండువా కప్పుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగు రామన్నను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో జైనథ్ మండలంలోని పెండల్‌వాడ, అర్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా జోగు రామన్న ప్రజలకు చేసిందేమీలేదని ఆరోపించారు. రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, కాంగ్రెస్‌కు ఓటు వేయించాలన్నారు. కార్యక్రమంలో సంతోష్‌రావు, ప్రవీణ్, మనోజ్, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

ఉట్నూర్‌రూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు పెందూర్ ప్రభాకర్, వినోద్‌నాయక్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ వారం రోజుల క్రితం మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో మా కోవర్టులను పంపుతున్నామని, రేఖానాయక్ ఓడిపోతుందనే కాంగ్రెస్ పార్టీలోకి పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మళ్లీ ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ గెలవాలని కాంగ్రెస్ నుంచి ఆమె పోటీ చేయించే ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వంరావు, శ్రీనివాస్, నవీన్, విజయ్, ఇస్మాయిల్, అభినయ్, హరీశ్, సుఫీయాన్, శశి, సాయి పాల్గొన్నారు.

నిర్మాణరంగ కార్మికులకు భద్రత కరువు



మాట్లాడుతున్న జగన్ సింగ్

ఎదులాపురం: భవన నిర్మాణ రంగ కార్మికులకు భద్రత లేకుండా పోయిందని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత అందిస్తామని ప్రచారం చేస్తున్నా.. పాలక పార్టీలు ఆవైపుకు దృష్టి సారించడం లేదన్నారు. కార్మిక వర్గాలు అనేక పోరాటాలు చేస్తే 2021లో కేంద్ర ప్రభుత్వం ఈ–శ్రమ్ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ నిరంతరంగా పోరాడుతుందన్నారు. సమావేశంలో నితిన్, వినోద్, సురేందర్, మహేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం..

కన్నాపూర్‌లో రమేశ్ రాథోడ్ పర్యటన

సిరికొండ: మండలంలోని కన్నాపూర్‌లో శనివారం బీజేపీ నాయకులు రాథోడ్ రమేశ్ పర్యటించారు. శ్రీశ్రీ కాంత్ మహరాజ్ మఠం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో గ్రామంలో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి, అధికారంలోనికి వస్తుందని అన్నారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు అమోల్, రఘురాం, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

సన్మానం

ఇచ్చోడ: సంగెం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం హైకోర్టు న్యాయమూర్తి సూర్యపల్లి నంద గారిని ట్రస్టు చైర్మన్ సంగెం సుధీర్‌కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన సేవ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేశ్, సభ్యులు చందుసింగ్ పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత పెంచాలి

ఎదులాపురం: ముస్లింల సమస్యల పరిష్కారం, రాజకీయ ప్రాధాన్యత పెంచాలని తెలంగాణ ముస్లిం సంఘాలు కోరాయి. ఆదిలాబాద్ చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ యూనుస్ అక్బానీ, సామాజిక కార్యకర్త ఖిజర్ పాషాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. జమియత్ ఉలేమా ఎ హింద్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాధ్యులు ముఫ్తీ ఘని, హఫీజ్ అబూ బక్కర్, హఫీజ్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎదులాపురం: పట్టణంలోని అల్లకుంట రాము జూలై 27న గాంధీనగర్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అదే రోజు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐఎంఈఐ ఆధారంగా గుర్తించారు. శనివారం టూ టౌన్ సీఐ అశోక్ బాధితుడిని స్టేషన్‌కి పిలిపించి సెల్‌ఫోన్ అప్పగించారు. ఎస్సైలు ప్రదీప్, నరేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

నేరడిగొండ: మండలంలోని వడూర్ హనుమాన్ మందిరంలో ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సప్తాహ వేడుకలు నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా భక్తులు గ్రామంలోని పురవీధుల గుండా భజన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దీంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. అనంతరం గ్రామంలోని వాగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాల కోసం ఎంపిక శిబిరం నిర్వహించారు. 74 మంది దివ్యాంగులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దివ్యాంగులు, పలు దివ్యాంగ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం వార్షికోత్సవం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ కళాకారులను సత్కారించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ.. సంఘం ద్వారా ఆదివాసీ సంస్కృతిక, సంప్రదాయాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుమర కోటేశ్వర్, జలైజాకు, రేలా రవి పాల్గొన్నారు.

నేడు

సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా గొర్రెల కాపరుల ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులతో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘువీర్ యాదవ్, అసుర హన్మండ్లు యాదవ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ విడత గొర్రెల పంపిణీలో జరుగుతున్న జాప్యం, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రావణ్ తెలిపారు. భీంసరి వద్ద అర్లి(టి) లైన్‌లో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా వర్ధంతి
- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తలమడుగు: నినాదాలు చేస్తున్న నాయకులు



ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

నేరడిగొండ: దివంగత వైఎస్సార్ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడె గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ ఆడె వసంత్‌రావు ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుమారిలో ఉప సర్పంచ్ గడ్డం నరేష్ రెడ్డి, గ్రామస్తులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, షేక్ వకీల్, నారాయణ్ రెడ్డి, ఎండీ సద్దాం, బద్దం పోతారెడ్డి, క్రాంతికుమార్, శ్రీధర్, ప్రవీణ్, నీలకంఠేష్ పాల్గొన్నారు.

తలమడుగు: వైఎస్సార్ వర్ధంతిని మండల కేంద్రంతో పాటు సుంకిడిలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, తలమడుగులో వీడీసీ అధ్యక్షుడు అసం రవీందర్ వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణం రాజేశ్వర్, వెంకన్న యాదవ్, సర్పంచ్ గంగారాం, ప్రఫుల్ చందర్ రెడ్డి, రఫీక్, లస్మన్న పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. నాయకులు జాకురుల్లాఖాన్, లోఖండే దేవురావులు మాట్లాడుతూ.. వైఎస్సార్ అందించిన పథకాలు నేటికి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాయన్నారు. కైలాస్ జాదవ్, విలాస్ బానోత్, కరీంఖాన్, గజేందర్ రాథోడ్, ఎండీ నిజామ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్ మాట్లాడుతూ.. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటి వరకు నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ చైర్మన్ కొత్తురి లక్ష్మణ్, మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తాఫా, బద్దం పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ రాజశేఖర్ రెడ్డి అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం వైఎస్సార్ 14వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నో సంక్షేమ పథకాలతో జనాదరణ పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, భరత్ వాగ్మరే, షకీల్, రవి కిరణ్ రెడ్డి, అయ్యుబ్ ఖాన్, అస్బాత్ ఖాన్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్సార్ ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్, సోమసే వెంకట్‌రావ్, సోన్‌కాంబ్లే మనోహర్, ముఖడే ఉత్తం, జహిర్, కామ్రాజ్, దత్త, ఉత్తం, మానిక్‌రావ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: తెలుగువారి గుండెల్లో నిలిచిన మహానాయకుడు వైఎస్సార్ అని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సాఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భిక్షునాయక్, పుర్క బాపురావు, జాదవ్ సునీల్, కొమ్ము విజయ్, సుఫియాన్, సిరాజొద్దిన్, నితిన్, కలీమొద్దిన్, పరమేశ్వర్, సోహెల్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: పేదల ప్రాణదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. లక్షలాది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు అందించిన మహానేత అని కొనియాడారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

ఉట్నూర్‌రూరల్: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో మెగా డీఎస్సీ కోసం నిరసన దీక్ష చేపట్టారు. ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 25 వేలతో మెగా డీఎస్సీని తక్షణమే ప్రకటించాలన్నారు. వెంటనే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రైవేటుకు ధీటుగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, పుర్క బాపురావు, కలీం, కలీం పాషా సోఫియాన్న, గుగ్గిల్ల బెన్హర్, ప్రణయ్, రాహుల్, శ్రీశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ‘రెడ్‌క్రాస్’

జైనథ్: రెడ్‌క్రాస్ సొసైటీ నిరుపేదలకు అండగా నిలుస్తోందని సంఘం జిల్లా చైర్మన్ గంగేశ్వర్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని కాన్ప గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న 15 కుటుంబాలకు పోషకాలతో ఇప్పపువ్వు, డ్రైఫూట్స్ లడ్డులు, హోమ్ హైజినిక్ కిట్లు, తాడిపత్రిలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ స్టేట్ ఎంసీ మెంబర్ విజయ్‌బాబు, జైనథ్ మండల కోఆర్డినేటర్ క్యాతం శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.